# అరోక సంస్కృతి

"నీ అభ్యుదయ భావాలతో నన్ను చంపకు!" అంది సృజన.

దాని మాటలకి నిర్ఘాంతపోయాను. నేను కని పెంచిన పిల్లేనా అని అనుమానం వేసింది.

సృజన కనుముక్కు తీరులోనూ రంగులోనూ వాళ్ళ నాన్న పోలిక అనిపించినా, స్వభావంలో నా పోలిక వచ్చిందనుకునే దాన్ని. తనకి కావల్సింది హక్కుగా అడుగుతుంది. తనకి నచ్చినట్లుగానే చెయ్యాలంటుంది. ఎవరైనా విమర్శిస్తే, తనని తను సమర్థించుకుని ధైర్యంగా జవాబు చెబుతుంది. అయితే, దాని ఆలోచనా ధోరణి నాకు ఇంత వ్యతిరేకంగా తయారవుతుందనుకోలేదు.

చిన్నప్పుడు నేనూ పేచీలు పెట్టేదాన్ని. "ఇది మరీ మగరాయుడులా తయారవుతోంది. దీన్ని అదుపు చెయ్యడం ఎలాగో తెలియడం లేదు" అని విసుక్కునేది అమ్మ. "నిన్ను నేను అదుపు చెయ్యగలుగుతున్నానా!" అంటూ, నవ్వుతూ నన్ను పరోక్షంగా సమర్థించే వారు నాన్నగారు. అన్నయ్యలాగ నేను కూడా విద్యార్థి సంఘం కార్యకలాపాల్లో పాల్గొంటానంటే అమ్మ నాకు అడ్డు చెప్పేది–"ఆడపిల్లకి అటువంటివి మంచివి కావు. రేపు పెళ్ళి సంబంధం ఎలా కుదురుతుంది?" అంటూ. చిన్నప్పటి నుంచీ అన్నయ్యని చూసినట్లే నన్నూ చూడాలని పేచీ పెట్టేదాన్ని. అన్నయ్యని ఒకలాగ, నన్నొకలాగ చూస్తున్నారనిపించేది.

ముఖ్యంగా అమ్మ ఆ వివక్షని ఎక్కువగా చూపించేది. "వాడు మగ పిల్లవాడు, నువ్వు ఆడపిల్లవి" అంటూ. అన్నాలు తిన్నాక కంచాలు తియ్యమనేది నన్ను. అన్నయ్య చెయ్యి కడుక్కుని, వెళ్ళిపోతూంటే ఏమీ అనేది కాదు–అది సహజం అన్నట్లు. అందుకే నాలో పట్టుదల పెరిగేది. ప్రతి దాంట్లో అన్నయ్యతో పోటీపడేదాన్ని. అన్నయ్యంటే నా

కిష్టమే. అందుకే వాడిలా ప్రవర్తించాలనుకునే దాన్ని. అన్నయ్యలాగే నేను కూడా హేతువాద భావాల చేత ప్రభావితురాలినయ్యాను.

వరకట్నం తీసుకునే ఆచారం అంటే అసహ్యం వేసేది. అంతకన్న దురాచారం మరొకటి లేదనిపించేది. వరకట్నం కోరే వాడిని చేసుకోకూడదని నిశ్చయించుకున్నాను. అన్నయ్య స్నేహితుడు భాస్కర్ నన్ను ఇష్టపడినప్పుడు, నా షరతుల ప్రకారమే పెళ్ళికి అంగీకరించాను. భాస్కర్ తల్లిదండ్రులు సౌమ్యులు, నిరాడంబరులు. మరీ అంత ఉన్న వాళ్ళు కారు మాలాగే. అయినా కట్నం అడగలేదు. కొడుకు ఆనందమే ముఖ్యం అన్నారు. మేము సంప్రదాయసిద్ధంగా కాకుండా, నిరాడంబరంగా రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నాం. నేను ఉద్యోగం చేస్తానంటే అభ్యంతరం చెప్పలేదు. మా పెళ్ళయ్యాక వాళ్ళు మా దగ్గరే ఉంటూ వచ్చారు.

ముందుగా ఆడపిల్ల పుట్టిందని ఇంట్లో వాళ్ళకు కొంత నిరుత్సాహం కలిగిందని గమనించి, నేను సృజనపట్ల మరింత మమకారం చూపించేదాన్ని. దాన్నిమగపిల్లవాడిలాగే పెంచాను. కానీ, కాలేజీలో చేరాక, దానిలో నేను ఊహించలేనంతగా మార్పులొచ్చాయి. ముస్తాబు చేసుకోవడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపించేది. నా దగ్గర నుంచి డబ్బు తీసుకుని దానికి కావల్సిన దుస్తులూ అవీ కొనుక్కునేది. పార్టీలూ పండగలూ అంటే సరదా పడేది. ఆడంబరంగా తయారయ్యేది. వద్దంటే గొడవ చేసేది. అది తీసుకునే పాకెట్ మనీ కూడాఎక్కువ. ఎం.బి.ఏ. చేయిద్దామని మేం అనుకుంటే, తను హోమ్ సైన్స్ చదువుతానని పట్టుపట్టింది. దాని మాట దేన్నీ కాదనలేని బలహీనత ఏర్పడింది నాలో. దాని కోరికలు తీర్చడానికి ఇంట్లో ఎవరు అభ్యంతర పెట్టినా, ముందు నేనే ఊరుకునేదాన్నికాదు. ఆ బలహీనతే ఇప్పుడు నా మెడకి బిగుసుకుంది.

ఒక స్నేహితుడి కూతురి పెళ్ళికి వెళ్ళినప్పుడు, వాళ్ళ బంధువులు-అమెరికా నుంచి వచ్చిన వాళ్ళు సృజనని చూసి ముచ్చటపడ్డారు. పక్కా తెలుగింటి ఆడపడుచులా ముస్తాబు చేసుకున్న సృజన వాళ్ళకి అన్ని విధాలా నచ్చింది. వాళ్ళబ్బాయికి చేసుకునే ఉద్దేశంతో కబురు పంపారు-పెళ్ళి చూపులు ఏర్పాటు చెయ్యమని. ఆ అబ్బాయి పొడుగ్గా, సృజనకి ఈడూ జోడూగాఉన్నాడు. కాదనడానికి కారణాలు కనిపించలేదు. ఎటొచ్చీ దాని చదువు పూర్తవడానికి ఇంకా కొన్ని నెలలు పడుతుంది. ఆ విషయమై సంకోచించాం. కానీ, వాళ్ళు 'మన వాళ్ళే' ననీ, చేతికందివచ్చిన సంబంధం అనీ, అమెరికాలో ముప్ఫయ్యేళ్ళ నుంచి ఉంటున్నా తెలుగుభాషనీ, తెలుగుతనాన్నీ మరచిపోలేదనీ, పిల్లవాడు ముత్యంలా ఉన్నాడనీ మురిసిపోయారు మా అత్తగారూ మామగారూ.

ఆచారం ప్రకారం పెళ్ళిచూపులుకి వాళ్ళు తిథి వార నక్షత్రాలు చూసుకుని ఫలానా రోజున ఫలానా టైముకి వస్తున్నామని తెలియజేశారు మాకు. మా అత్తగారు టిఫిన్లూ వగైరా ఏర్పాట్లన్నీ చూశారు. సృజన మంచి పట్టు చీర కట్టుకుని నగలూ, పువ్వులూ పెట్టుకుని ముస్తాబయింది.

"అదేమిటే, సినిమాలో పెళ్లికూతురిలా తయారయావ్?" అన్నాను దాని వేషం చూసి.

"చక్కగా పెళ్ళి కళ ఉట్టి పడుతూంటే అలా అంటావేమిటి?" అన్నారు మా అత్తగారు.

కుర్రవాడి తల్లి కూడా జానెడు జరీ అంచుది కంచి పట్టు చీర కట్టుకుని మెడ నిండా నగలతో వచ్చింది. నేను జరీలేని పోచంపల్లి చీర కట్టుకున్నాను. మేము పెట్టిన పిండివంటలు తింటూ, కాఫీ తాగుతూ, అంతర్జాతీయ పరిస్థితుల గురించీ, అమెరికాలో ఎన్నికల గురించీ, ప్రపంచీకరణ ఫలితాల గురించీ కొంతసేపు ముచ్చటించారు మాతో. మా అభిప్రాయాలూ వాళ్ళవీ అంతగా కలవలేదు. పెళ్ళి కొడుకు తండ్రి బుష్‌ని సమర్థిసూంటే భాస్కర్ విమర్శించాడు మర్యాదగానే.

నేను కూడా ఏదో అనబోతూంటే, పెళ్ళికొడుకు తల్లి కలుగజేసుకుని, కొడుకుని ఉద్దేశించి, "శ్రీకాంత్, నువ్వు ఆ అమ్మాయితో ఏమైనా మాట్లాడతావా?" అంది. నేను ఆ సూచనని అందుకుని, "సృజనా, మీరిద్దరూ మేడ మీదికెళ్ళి నీ గదిలో కూర్చుని మాట్లాడుకోండి" అన్నాను. ఇద్దరూ సంతోషంగా లేచి వెళ్ళారు.

అమెరికా ముచ్చట్లని పక్కన పెట్టి, పెళ్ళి వ్యవహారంలోకి దిగింది ఆవిడ.

"మా వాడికి మీ అమ్మాయి నచ్చింది. మీ అమ్మాయికి కూడా వాడు నచ్చినట్లే అనిపిస్తోంది. పెళ్ళిముహూర్తం ఎప్పుడు పెట్టుకున్నా ముందుగా తక్కిన విషయాలు మాట్లాడుకుంటే బావుంటుంది కదా" అంది.

"అలాగే చెప్పండి" అన్నాను ఉత్సాహంగానే.

"మేం మూడు దశాబ్దాలుగా అమెరికాలో ఉంటున్నా,మన సంస్కృతిని దూరం చేసుకోలేదు. పెళ్ళి వేడుకగా, సంప్రదాయానుసారంగా, యథావిధిగా జరిపించాలని మా కోరిక. మాకు ఉన్నవాడు ఒక్కడే. మన వాళ్ళు మన ఆచారాలన్నింటినీ మరిచిపోతున్నారు. వాటిని ఈ తరం వాళ్లకి తెలియజెప్పే అవసరం మనకుంది కదా" అంది ఆవిడ.

"అవును" అన్నాను వాదించడం ఎందుకని.

ఆవిడ కొనసాగించింది. "ఈ మధ్య ఇండియాలో పెళ్ళిళ్ళు ఆధునికత పేరుతో ఇష్టం వచ్చినట్లు జరుపుతున్నారు. ఎక్కడా తెలుగుతనం కనిపించడం లేదు.

షామియానాలు వేసి బఫే డిన్నర్లు ఇవ్వడం, ఉత్తరదేశపు భోజన పదార్థాలు పెట్ట[illegible], అరగంట, నలభై నిముషాల్లో మొక్కుబడిగా పెళ్ళి కానిచ్చెయ్యడం చేస్తున్నారు కొందరు. మా కలాంటివి ఇష్టంలేదండి. ఉన్నవాడు ఒక్కడు. వాడి పెళ్ళి చక్కగా లక్షణంగా జరగాలి. పానకం బిందెలతో ఎదుర్కోలు మొదలుకుని అప్పగింతల వరకూ అన్నీ సలక్షణంగా జరిపించాలి. అక్కడ అమెరికాలో బంధుమిత్రులందరికీ వీడియోలో చూపించడానికి బావుంటుంది కదండీ" అంది.

ఇదంతా నాకు చాలా ఇబ్బందిగా అనిపించినా, చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను. మనసులో "చూద్దాంలే" అనుకుని.

భాస్కర్ కలుగజేసుకుని "ఇంతవరకూ మా ఇంట్లో మా పెళ్ళిళ్లు చాలా నిరాడంబరంగా జరిగాయి. ఆ పద్ధతులన్నీ మాకు అలవాటు తప్పిపోయాయి. లాంఛనాలవీ ఏ విధంగా జరిపించాలి? మీరే చెప్పండి" అన్నారు. శ్రీకాంత్ తండ్రి భార్య వంక చూశాడు–"నువ్వే చెప్పు" అన్నట్లుగా.

అప్పుడిక ఆవిడ వివరాలు చెప్పడం మొదలుపెట్టింది. వెండి పానకం బిందెలూ, వెండి బొట్టు పెట్టెలూ, పెళ్ళి కొడుక్కి వజ్రపుటుంగరం, మెళ్ళోకి సన్నని గొలుసూ, అత్తగారికీ ఆడపడుచుకీ సందర్భానికి తగిన జరీ అంచుకంచి పట్టుచీరలూ, పెళ్ళికూతురికి చంద్రహారం, ఒడ్డాణం, చేతికి వంకీలూ, కంకణాలూ, రవ్వల దుద్దులూ, వివాహ మంటపం అలంకరణ, విందు భోజనాల్లో ఉండాల్సిన పదార్థాలూ అన్నీ చెప్పిందావిడ. నాకు మతిపోయింది. మా అమ్మమ్మ చెప్పిన తన పెళ్ళి విశేషాలు గుర్తుకొచ్చాయి నాకు!

నేనూ, భాస్కర్ మౌనం వహించేసరికి, శ్రీకాంత్ తండ్రి భార్యని సమర్థిస్తూ "ఇవన్నీ మన సంస్కృతిని నిలబెట్టాలన్న తాపత్రయంతోనే. మేం పెళ్ళికి మళ్ళీ రావాలి కదా అంతదూరం నుంచి! తిరిగి వెళ్లేందుకు ఇక్కడే మీరు ప్రయాణం ఏర్పాట్లు చేస్తే బావుంటుంది" అన్నాడు చాలా మెత్తగా.

నేనూ, భాస్కర్ ముఖముఖాలు చూసుకున్నాం.

మధ్యలో మా అత్తగారు, "అమెరికాలో ఉంటున్నా, మన సంస్కృతిని నిలబెట్టాలని ఇంత శ్రద్ధగా ఆలోచిస్తున్నందుకు సంతోషంగా ఉందమ్మా" అన్నారు. మా మామగారు న్యూస్ పేపర్‌కేసి చూస్తూ కూర్చున్నారు.

పిల్లలిద్దరూ మేడ మీంచి దిగి వచ్చారు. ఇద్దరూ ప్రసన్నంగా ఉన్నారు. ఈసారి సోఫాలో పక్కపక్కన కూర్చున్నారు. ఇంక పీటల మీద కూర్చోవడమే తరువాయి అన్నట్లుగా ఉంది వాళ్ళ వరస చూస్తే.

"ఏమ్మా, మా అబ్బాయి నచ్చాడా?" అని అడిగింది శ్రీకాంత్ తల్లి.

సృజన బుగ్గల మీద సొట్టలు పడేటట్టు నవ్వింది.

"ఇక వెళ్ళొస్తామండీ. తక్కిన వివరాలు తరవాత మాట్లాడుకుందాం" అంటూ సోఫాలోంచి లేచింది శ్రీకాంత్ తల్లి. అందరం లేచి నిలబడ్డాం. వాళ్లని గేటు వరకూ సాగనంపి లోపలికొచ్చాం.

సృజనలో ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్లుంది. "హి ఈజ్ సచ్ ఎ ఛార్మింగ్ ఫెలో!" అంది మేం అడక్కుండానే.

"నీకు బాగా నచ్చాడన్న మాట!" అన్నాడు భాస్కర్.

"అఫ్‌కోర్స్!" అంది సృజన.

"కానీ..." అన్నాను నేను సందేహంగా.

ఏమిటన్నట్లు అందరూ నావైపు ఆత్రుతగా చూశారు.

"వాళ్ళు మరీ చాదస్తం మనుషుల్లాగా, దురాశాపరుల్లాగా కనిపిస్తున్నారు" అన్నాను.

"అదేమిటమ్మా వాళ్ళు అమెరికాలో ఉంటున్నారు. వాళ్లకి చాదస్తం ఏమిటి! దురాశాపరులుగా ఉండటానికి వాళ్లకేం తక్కువని!" అంది సృజన-అప్పుడే వాళ్ళని సమర్థిస్తూ.

"ఏదో, పెళ్ళి కాస్త ముచ్చటగా, వాళ్ళ హోదాకి తగినట్లు ఘనంగా జరిపించాలని కోరుకుంటున్నారేమో" అన్నారు మా అత్తగారు.

"ఇంతకు ముందు మా పెళ్ళి ఎంత నిరాడంబరంగా, అభ్యుదయకరంగా జరిగిందో మీకు తెలియదా? వీళ్ళు కోరినంత ఆడంబరంగా పెళ్ళి చేసి మనకిలేని గొప్పని మనం చాటుకోవాలా?" అన్నాను.

"ఏం,మనం అంత లేని వాళ్ళమా?" అని ఎదురు ప్రశ్న వేసింది సృజన.

"అమెరికాలో ఉంటూ ఉద్యోగం చేస్తున్న ఆ పెళ్ళి కొడుకు ఏమీ ఎరగనట్లు కట్నం కానుకల విషయం తల్లిదండ్రుల మీదికి వదిలెయ్యడం ఏమిటి? అమెరికా వెళ్ళి ఏం అభ్యుదయం సాధించినట్లు!" అన్నాను ఒళ్ళు మండి.

వెంటనే "నీ అభ్యుదయ భావాలతో నన్ను చంపకు!" అంది సృజన చిరాకుగా.

"అది కాదే..." అని నేను వివరించి చెప్పబోయే లోపున, సృజన "శ్రీకాంత్ అసలు ఎంత సరదా పడుతున్నాడో తెలుసా-సాంప్రదాయకంగా పెళ్లి చేసుకోవాలని! ఏ చిన్న ఆచారమూ వదిలిపెట్టకుంటా గ్రాండ్‌గా చేసుకోవాలి అంటున్నాడు" అంది.

"సరదా పడితే సరిపోతుందా? వాళ్ళమ్మగారు చెప్పినవన్నీ చెయ్యాలంటే ఎ లక్షలవుతుందో తెలుసా? అయినా, ఎందుకా అనవసరపు ఖర్చులు!" అన్నాను- మొదటిసారి సృజనని ఖండిస్తూ.

"ఏమిటమ్మా అలా లెక్కలు చూసుకుంటున్నావ్! మీరిద్దరూ సంపాదించేదంతా ఎవరికోసం? అమెరికా సంబంధం అంటే మాటలా!" అంది సృజన నదురూ బెదురూ లేకుండా.

అమెరికా అంటే ఎంత మోజు! పైగా మనస్సులో పెరిగే సంప్రదాయపు బూజు! ఒకప్పుడు నేనూ నా తల్లిదండ్రుల్ని ఎదిరించి మాట్లాడాను. పెద్ద వాళ్ళ మాటల్ని కాదని, నా హక్కులకోసం పోరాడాను కానీ, ఆ పోరాటం వెనక స్వాభిమానం ఉండేది. ఎవరి మీదా ఆర్థికంగా ఆధారపడకూడదు అనే దృష్టి ఉండేది. తల్లిదండ్రుల చేత ఖర్చు పెట్టించాలంటే మనస్సు కుంచించుకుపోయేది. ఆడంబరంగా జీవించడం అమాన వీయంగా అనిపించేది. వివాహం ఒక ముచ్చటేకాదు, బాధ్యత అనిపించేది.

వీళ్ళ పెళ్ళి ముచ్చట మూణ్ణాళ్ళతో ముగియదన్న హామీ ఏముంది? సృజన అందరిలాగే ఈనాటి ధన సంస్కృతికి బలి అవుతోందన్న బాధ పట్టుకుంది.

ఈ యువతరాన్ని వస్తు వ్యామోహంలోంచీ, ఆడంబరాల్లోంచీ ఎలా బయటపడేటట్లు చెయ్యాలా అని నా మనస్సు శోధిస్తూనే ఉంది.

(ఆంధ్రజ్యోతి, 20 ఫిబ్రవరి 2005)